ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025





సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు బహూకరణ

వార్ వన్‌సైడ్

కలిసొచ్చిన పిచ్‌పై కదం తొక్కిన టీమిండియా

దక్షిణాఫ్రికాపై ఘన విజయం

- సెంచరీతో చెలరేగిన యశస్వి జైస్వాల్
- అర్ధ సెంచరీలు చేసిన విరాట్, రోహిత్
- ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగిన స్టేడియం
- సౌతాఫ్రికా ప్లేయర్ డీ కాక్ సెంచరీ వృథా
- నాలుగేసి వికెట్లు తీసిన ప్రసిద్ధ్ కృష్ణ, కులదీప్ యాదవ్



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలిసొచ్చిన పిచ్‌పై భారత్ బ్యాటర్లు కదంతొక్కారు. సౌతాఫ్రికాపై ఆద్యంతం ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదైనా, విజయం దోబూచులాడగా, పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ హవా కొనసాగింది. దీంతో తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.


టాస్ గెలిచిన భారత కెప్టెన్ కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి భారత్ బౌలర్లు రాణించడంతో దక్షిణాఫ్రికా పూర్తి ఓవర్లు ఆడకుండానే 270 పరుగులకు ఆలౌట్ అయింది. సౌతాఫ్రికా ఓపెనర్ డీ కాక్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి సెంచరీ (106) సాధించగా, కెప్టెన్ బవుమా (48) భారత్ బౌలర్లను కొంతవరకు ఎదుర్కొన్నాడు. ప్రసిద్ధ కృష్ణ, కులదీప్ యాదవ్ అద్భుత బౌలింగ్‌తో చెరో నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది.

భారత్ బ్యాటింగ్ విధ్వంసం

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్ ఆటగాళ్ల బ్యాటింగ్ విధ్వంసం ప్రేక్షకులకు అసలైన క్రికెట్ మజాను అందించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీకి ఓపెనర్ యశస్వి జైస్వాల్ తోడై విధ్వంసకర బ్యాటింగ్‌తో అజేయ సెంచరీ సాధించాడు. జైస్వాల్ సెంచరీతో కదంతొక్కడంతో ప్రేక్షకులు ... మిగతా 6వ పేజీలో

మరిన్ని ఫొటోలు, వార్తలు 8వ పేజీలో

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం వాడవాడలా ఆయన విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పెదగదిలి జంక్షన్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ నేతలు

మెగా విశాఖ?

జీవీఎంసీలోకి పెందుర్తి, భీమిలి మండలాల్లో మిగిలిన గ్రామాలు, ఆనందపురం, పద్మనాభం మండలాలు

- సాధ్యాసాధ్యాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని డీఎంఏకు ప్రభుత్వం ఆదేశం
- విలీనం జరిగితే జిల్లా అంతా జీవీఎంసీలోనే...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. భీమిలి, పెందుర్తి మండలాల్లో గల మిగిలిన గ్రామాలతోపాటు ఆనందపురం, పద్మనాభం మండలాలను పూర్తిగా జీవీఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పెందుర్తి, భీమిలి ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తులపై పూర్తిస్థాయి పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని డీఎంఏను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించారు.



జీవీఎంసీ ప్రస్తుతం 682 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. సుమారు 21 లక్షల మంది జనాభా ఉండగా, 98 వార్డులుగా విభజించారు. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌ను 20 ఏళ్ల కిందట గాజువాక, పెందుర్తి మండలంలోని కొన్ని ప్రాంతాలు, మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది పరిసర ప్రాంతాలను కలుపుతూ జీవీఎంసీగా అప్‌గ్రేడ్ చేశారు. 2011లో భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీలతో పాటు పలు గ్రామాలను జీవీఎంసీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. అయితే కొన్ని గ్రామాల నాయకులు అభ్యంతరం చెబుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విలీన ప్రక్రియ ఆలస్యమైంది. ఎట్టకేలకు 2020లో ఇటు అనకాపల్లి, అటు భీమిలి మునిసిపాలిటీతో కూడిన జీవీఎంసీని 98 వార్డులుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 17తో ముగియబోతోంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఎన్నికలపై చర్చ మొదలైంది. అయితే భీమిలి, పెందుర్తి మండలాల్లో జీవీఎంసీ పరిధిలోకి రాకుండా మిగిలిపోయిన ప్రాంతాలతోపాటు పద్మనాభం, ఆనందపురం మండలాలను కూడా జీవీఎంసీలో విలీనం చేయాలని కోరుతూ పెందుర్తి, భీమిలి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, గంటా శ్రీనివాసరావులు రాష్ట్ర ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు. ఈ అంశాన్ని పరిశీలించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీడోల బాలవీరాంజనేయస్వామికి ప్రభుత్వం సూచించింది. మంత్రి ఆయా ఎమ్మెల్యేల విజ్ఞప్తులను పరిశీలించిన తర్వాత నాలుగు మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే అంశానికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. నాలుగు మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే అంశంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్‌ను ఆదేశిస్తూ సురేష్‌కుమార్ మెమో జారీచేశారు. దీంతో విలీన ప్రక్రియ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందనే సంకేతాలు వెలువడినట్టయింది.

విలీనం జరిగితే జిల్లా మొత్తం జీవీఎంసీ పరిధిలోకే...

ఆ నాలుగు మండలాలు జీవీఎంసీలో ... మిగతా 6వ పేజీలో

విమాన టికెట్లకు రెక్కలు

'ఇండిగో సంక్షోభంతో భారీగా పెరిగిన ధరలు



- ఢిల్లీ-విశాఖపట్నం టికెట్ ధర రూ.73 వేల నుంచి రూ.లక్ష
- చెన్నై-విశాఖ ధర రూ.49 వేలు
- హైదరాబాద్-విశాఖ 10,468 నుంచి రూ.33 వేలు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఇండిగో' విమాన సంస్థలో ఏర్పడిన సంక్షోభంతో మూడు రోజులుగా దేశవ్యాప్తంగా వందలాది సర్వీసులు రద్దయిపోతున్నాయి. తొలి రోజు 175 విమానాలు, రెండో రోజు మరో 175, మూడో రోజు 500కు పైగా విమానాలు రద్దయ్యాయి. విశాఖపట్నం విమానాశ్రయంలో చూసుకుంటే ఒక్క శనివారం తొమ్మిది ఇండిగో సర్వీసులు ఆగిపోయాయి. విమాన సర్వీస్‌లలో ఎక్కువ ఇండిగో విమానాలే ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో ఉన్న ఇతర విమానాల్లో గమ్య స్థానాలకు చేరడానికి ప్రయత్నిస్తున్నారు. దాంతో ఆయా సంస్థలు టికెట్ల ధరలు భారీగా పెంచేశాయి. ఇండియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి వన్డే క్రికెట్ మ్యాచ్ శనివారం విశాఖపట్నంలో జరగడంతో దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఇక్కడకు రావడానికి ప్రయత్నించారు. దాంతో టికెట్ల ధరలు మరింత పెరిగిపోయాయి. ఢిల్లీ నుంచి శనివారం విశాఖపట్నం రావడానికి టికెట్ ధర కనీసం రూ.73,716 కాగా అత్యధికంగా రూ1,00,602 పలికింది. చెన్నై నుంచి విశాఖపట్నం రావడానికి టికెట్ రేటు రూ.49,033 పలికింది. ఇక హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావడానికి రూ.10,446 నుంచి రూ.33,769 ధర పలికింది. ఆదివారం విశాఖ నుంచి హైదరాబాద్, చెన్నై, ఢిల్లీకి వెళ్లాల్సిన టికెట్ల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. ఇండిగోలో ఏర్పడిన అంతర్గత సంక్షోభం కారణంగా ఇదంతా జరిగిందని, టికెట్లను రీషెడ్యూలింగ్ బుక్ చేసుకోవడానికి ప్రయాణికులకు అవకాశం కల్పించాలని కేంద్ర పౌర విమానయాన శాఖకు ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. విజయమోహన్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఈ సమయంలో టికెట్ల ధరలను అడ్డగోలుగా పెంచకుండా నియంత్రణ విధించాలని కోరారు.

అడ్డగోలు ప్రతిపాదనలకు చెక్

- బీచ్‌రోడ్డులో చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణ కోరదాం
- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం
- గతానికి భిన్నంగా వాడీవేడిగా సమావేశం
- అజెండాలోని 248 అంశాలు ఆమోదం, 34 వాయిదా
- ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రాళ్ల తొలగింపునకు రూ.14 లక్షలు ఖర్చా!
- అధికారులను నిలదీసిన మేయర్, సభ్యులు
- బీచ్‌రోడ్డులో అనధికార దుకాణాలపై సర్వేకు ఆదేశం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం గతానికి భిన్నంగా వాడీవేడిగా సాగింది. గతంలో అజెండాలోని అంశాలపై మొక్కుబడిగా చర్చించి ఆమోదించేస్తుండేవారు. అలాగే రెండు, మూడు గంటల్లోనే సమావేశం ముగించేసేశారు. కానీ, ఈసారి ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ చర్చించారు.

జీవీఎంసీ పాత కౌన్సిల్‌హాలులో శనివారం సమావేశమైన స్టాండింగ్ కమిటీ ప్రధాన అజెండాలోని 257 అంశాలతోపాటు టేబుల్ అజెండాలోని 30 అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ప్రధాన అజెండాలోని 216 అంశాలను ఆమోదించిన కమిటీ 34 అంశాలను ... మిగతా 6వ పేజీలో



ఒక గదిలో తల్లి విగతజీవిగా ఉండగా, మరో గదిలో నిద్రిస్తున్న కుమారుడు

మృతదేహంతో మూడు రోజులు

- తల్లి పక్కనే మానసిక దివ్యాంగుడు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన తల్లి మృతిచెందిందని తెలియని ఓ మానసిక దివ్యాంగుడైన కుమారుడు మూడు రోజుల పాటు మృతదేహం పక్కనే ఉన్నాడు. ఇందుకు సంబంధించి నగర పరిధిలోని గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక సమీపంలోని గొంతినవానిపాలెంలో ... మిగతా 6వ పేజీలో

వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా తులసీ దళార్చన, నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న సన్నిధిలో పిల్లలకు పాలు పంపిణీ



చిన్నారికి పాలు అందజేస్తున్న మంత్రి అనిత

సింహాచలం,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దర్శనానికి తల్లిదండ్రులతో వచ్చిన పిల్లలకు దేవస్థానం సిబ్బంది వేడి పాలు అందజేస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈఓ సుజాతతో కలిసి ఎస్‌బీటీ గేటు వద్ద క్యూలో ఉన్న పిల్లలకు మంత్రి స్వయంగా వేడి పాలు అందజేసి, వారితో ముచ్చటించారు.

డిమెన్షియా వ్యాధిపై అవగాహన అవసరం



ఎంపీ శ్రీభరత్‌ను సన్మానిస్తున్న డెమ్‌కాన్ సంస్థ ప్రతినిధులు

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరికి డిమెన్షియా వ్యాధి పట్ల అవగాహన అవసరమని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. డెమెకాన్ - 2025 పేరుతో జిమ్సర్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం ఆసుపత్రిని డిమెన్షియా ఫ్రెండ్లీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణి సుందరం, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్‌రాజు, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వైద్యులు, పరిశోధకులు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవంతిలో సాంకేతిక ఉత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ముత్తంశెట్టి, తదితరులు

తగరపువలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అవంతి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నుంచి ప్రగ్యాస్ 2025 పేరుతో రాష్ట్ర స్థాయి సాంకేతిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 12 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు 14 గ్రూపులుగా ఏర్పడి పలు అంశాలపై తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీవీస్ మేనేజరు ఎంఎస్ఎన్ రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, బ్రహ్మకుమారి పీఠానికి చెందిన తనూజ, కళాశాల అడ్మిన్ ఎస్. విశ్వప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ కరుణకుమారికి సత్కారం



క్రికెటర్ కరుణకుమారిని సత్కరిస్తున్న రవితేజ

సాగర్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాలికలు క్రికెటర్ కరుణకుమారిని ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. శనివారం ఆయన సాగర్‌నగర్‌లోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు వెళ్లి క్రికెటర్ పాంగి కరుణ కుమారిని సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీ 20 అంధుల మహిళా వరల్డ్ కప్ విజయంలో కరుణకుమారి చూపిన ప్రతిభను కొనియాడారు. అనంతరం పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా అంతకముందు ఆయన 8వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. భువనేశ్వరినగర్, ముసలయ్యపాలెం ప్రాంతాల్లో తాగునీటి సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల రామ్మోహన్, బి. దొరబాబు, మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ హాల్ టిక్కెట్లు పంపిణీ

తగరపువలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయనున్న 80 మంది విద్యార్థులకు ఎంఈఓ ఎ.జయప్రద శనివారం హాల్ టికెట్లు పంపిణీ చేశారు.చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి హెచ్ఎం ఆదినారాయణ అధ్యక్షత వహించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఉచితంగా శిక్షణ అందించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఆ సంస్థకు చెందిన జి. మోహనరావు, రేఖ అప్పారావు, లక్ష్మీపురం హెచ్ఎం డి. సత్యారావు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు



భీమునిపట్నంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు

అంబేడ్కర్ అడుగు జాడలో నడుద్దాం

- నియోజకవర్గంలో పలుచోట్ల వర్ధంతి సభలు
- అంబేడ్కర్ సేవలను కొనియాడిన నాయకులు

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభలు జరిగాయి. నాయకులు అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. భీమునిపట్నంలోని డైట్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 3వ వార్డు అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు, కుప్పిలి వెంకటేశ్, కంచర్ల కామేశ్వరరావు, గండిబోయిన పోలిరాజు, వియ్యపు పోతురాజు, మహేష్‌రెడ్డి, కాసరపు పెద ఎల్లాజి, నక్కెళ్ల పెద వెంకటరావు, గుండాసు అరవింద్, గాడు ఆనంద్, ఆవాల సూరిబాబు, సారిపిల్లి సురేశ్, చిట్టిబోయిన రాము, యానాపు శ్రీనివాసరావు, కోండ్రు రామస్వామి, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గాడు సన్యాసినాయుడు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ చీడి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ జరిగింది. అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేడ్కర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత నాయకుడు భాగం గోపాలరావు అంబేడ్కర్ విగ్రహా నికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గాడు సన్యాసినాయుడు, టీడీపీ మూడో వార్డు అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్, జనసేన 1వ వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి, వైసీపీ నాయకులు ఎస్. కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు పూలమాల వేసి, అంజలి ఘటించారు.

మధురవాడలో..

మధురవాడ : కుల వ్యవస్థ నిర్మూలనకు అహర్నిశలు పోరాడిన వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అని సీపీఐ నాయకుడు మరుపిళ్ల పైడిరాజు అన్నారు. మల్లయ్యపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కుడితి రామారావు, వి. సత్యనారాయణ, వేలంగిణిరావు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం : వేములవలసలో మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బంక సత్యన్నారాయణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దెమ్మెద అప్పలసూరి, నాయకులు మజ్జి వెంకటరావు, చెన్నా సత్యం, కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు. పెద్దిపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, విశాఖ కిషాన్ మోర్చ మాజీ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, మండల అధ్యక్షురాలు పిల్లా విజయ పాల్గొన్నారు.

అనంతవరంలో..

పద్మనాభం రూరల్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి గొర్రెపాటి వెంకట లక్ష్మి అన్నారు. అనంతవరంలో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ ప్రాథమిక హక్కులు పొందడంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సిద్ధనాతి వెంకట్రావు. వార్డు సభ్యులు రమణమ్మ, అప్పలసూర్యనారాయణ, తాతాజీ పాల్గొన్నారు.



మామిడిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

మామిడిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు మామిడిపాలెంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని స్థానిక నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహం దాత మధు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు వి. వెంకటరమణ, రాంబాబు వి. నరసింగరావు, చైతన్య, ఆర్. భార్గవ్, శంకర్, అప్పలరాజు పాల్గొన్నారు. చిట్టివలసలోని అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు అప్పలరాజు, మహేశ్వరరావు,రాజ్యలక్ష్మి, సునీత పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో నాయకులు కె. రాంబాబు, ఎం. అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, రామ పైడయ్య, నూలు ఆదినారాయణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తగరపువలస కూడలిలో వైసీపీ ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు బాగం గోపాలరావు, వైసీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, రామునాయుడు, వెంకటరెడ్డి పాల్గొన్నారు. బంగ్లామెట్ట, కొండపేట, విల్సన్‌పేటలో కూడా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు విజయకుమార్, ప్రసన్న పాల్గొన్నారు.



పద్మనాభంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి...

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లో అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు ఈర్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమంలో జరిగింది. ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు టి. పద్దు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. పద్మనాభంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి, మండల ఉపాధ్యక్షుడు మచ్చ సోమేశ్వరరావు, హంస మహేశ్, పాలూరి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పేర్రాజు, వెంకటరావు పాల్గొన్నారు.

క్రికెట్ సందడి

టీ షర్ట్‌లు, టోపీలతో అభిమానుల హంగామా



అభిమానులతో కిటకిటలాడుతున్న స్టేడియం పరిసరాలు



ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత్ - సౌత్ ఆఫ్రికా వన్డే మ్యాచ్‌కు వేదికైన ఏసీఏ-వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద అభిమానుల సందడి నెలకొంది. జూ పార్కు నుంచి ఎండాడ జాతీయ రహదారి మీదుగా స్టేడియానికి వెళ్లే మార్గంలో అభిమానులు టీషర్ట్‌లు, రిస్ట్ బ్యాండ్‌లు, జాతీయ జెండాలు, టోపీలు ధరించి హంగామా చేశారు. టీ షర్ట్, క్యాప్, జాతీయ జెండాలను ఒక్కొక్కటి రూ. 200 వరకు వ్యాపారులు విక్రయించారు. రిస్ట్ బ్యాండ్‌లు రూ. 20, బుగ్గ మీద పెయింటింగ్‌కు రూ. 30 వరకు తీసుకున్నారు.

సైడ్ లైట్స్

మధురవాడ : స్టేడియం పరిసరాలు నీలిరంగు జెర్సీలు ధరించిన ప్రేక్షకులతో నిండిపో యాయి. ఎక్కువ మంది కోహ్లీ, రోహిత్ పేర్లుతో ఉన్న జెర్సీలను ధరించారు.

- ఉదయం 10 గంటల నుంచే గేట్ల వద్ద ప్రేక్షకులు బారులు తీరారు. 10.30 నుంచి నిర్వాహకులు లోపలికి పంపించారు.
- జేబు దొంగలు చేతివాటం చూపించడంతో పలువురు పర్సులు పోగొట్టుకున్నారు. కొందరి మొబైల్ ఫోన్లు పోయాయి.
- భారత్ టాస్ గెలిచినప్పుడు గ్యాలరీల్లోని అభిమానులు గట్టిగా కేకలు వేశారు.
- రోహిత్, కోహ్లీ ఫ్లకార్డులను గ్యాలరీలో ఉన్న వారు పదే పదే చూపించారు.

వార్ వన్‌సైడ్

... 5వ పేజీ తరువాయి

కరతాళధ్వనులతో స్టేండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఇక మూడో మ్యాచ్‌లోనూ రోహిత్ శర్మ అర్ధసెంచరీ సాధించాడు. 25 ఓవర్ల వరకు ఓపెనర్ల దూకుడు కొనసాగింది. 54 బంతుల్లో ఆరు బౌండరీలు, సిక్సర్‌తో రోహిత్ తన కెరీర్‌లో 61వ అర్ధ సెంచరీ పూర్తిచేయగా...మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ 75 బంతుల్లో మూడు బౌండరీలు, సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తిచేశాడు. జోరుమీదున్న రోహిత్ శర్మ వ్యక్తిగత 75 పరుగులవద్ద తొలి వికెట్‌గా వెనుతిరగడంతో బ్యాటింగ్‌కు దిగిన విరాట్ కోహ్లీ తొలి బంతి నుంచీ స్కోరు బోర్డు పరుగులెత్తించాడు. ఈ దశలో యశస్వి జైస్వాల్ 111 బంతుల్లో పది ఫోర్లు, సిక్సర్‌తో వన్డే కెరీర్‌లో ఏడో సెంచరీ పూర్తిచేశాడు. విరాట్ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 53వ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నిగిడి వేసిన 40 ఓవర్‌లో విరాట్ కోహ్లీ బౌండరీ బాది మ్యాచ్‌ను విజయవంతంగా ముగించాడు.

కనువిందు చేసిన విరాట్, రోహిత్

ప్రేక్షకుల కల నెరవేరింది.అభిమాన క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల బ్యాటింగ్ చూసేందుకు అష్టకష్టాలు పడి టికెట్లు సాధించుకున్న వారి ఆశ తీరింది.వీరిద్దరూ తమదైన శైలి బ్యాటింగ్‌తో ప్రేక్షకులకు కనువిందు చేశారు. సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించారు. విరాట్, రోహిత్, జైస్వాల్ బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లకు చూపిస్తుంటే ప్రేక్షకులు కేరింతలతో స్టేడియంను హోరెత్తించారు. ముగ్గురూ బ్యాటింగ్ చేస్తున్నంత సేపూ స్టేడియంలోని ప్రేక్షకులంతా కుర్చీల్లోంచి లేచి నిలబడి మరీ తిలకించడం విశేషం.

మెగా విశాఖ ?

... 5వ పేజీ తరువాయి

విలీనం అయితే జిల్లా మొత్తం నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చేసినట్టవుతుంది.జీవీఎంసీ జనాభా ప్రస్తుతం 21 లక్షలు ఉన్నారు. ఇప్పుడు కొత్తగా నాలుగు మండలాలు విలీనమైతే వాటి పరిధిలోని 87 గ్రామాల్లో గల నాలుగు లక్షల మందిని కలుపుకుని జనాభా సంఖ్య 25 లక్షలు దాటుతుంది. నాలుగు మండలాల విలీనం ప్రక్రియ మొదలైతే ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనబంద గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్ వ్యక్తులు మరో అక్రమానికి పాల్పడ్డారు. అధికారులు రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో గెడ్డ ఆక్రమించి రోడ్డు వేయాలని భావించారు. ఈమేరకు వారు శనివారం పనులను ప్రారంభించగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. లే అవుట్‌కు ప్రస్తుతం వేసిన మార్గం కాకుండా లక్ష్మీపురం నుంచి కరగానిపేట మీదుగా రోడ్డు వేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని అక్కడి నుంచి పనులను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఉన్న 200 మీటర్ల గెడ్డను పూడ్చి, రహదారి నిర్మిస్తున్న విషయాన్ని తహశీల్దార్ పైల రామారావు తెలుసుకుని సిబ్బందిని పంపించారు. వీఆర్ఓ పురుషోత్తం, సర్వేయర్ కామేశ్ గెడ్డ ప్రాంతాన్ని సందర్శించి,అది ప్రభుత్వానికి చెందినదని, గెడ్డ పూడ్చి వేసి రహదారి ఎలా నిర్మిస్తారని వాహనాలను అడ్డగించారు. దీంతో వారు పనులను నిలిపివేసి వెళ్లిపోయారు.

మృతదేహంతో మూడు రోజులు

... 5వ పేజీ తరువాయి

పచ్చికోరు లక్ష్మి (65), తన చిన్న కుమారుడు సంతోషరావుతో కలిసి నివసిస్తోంది. పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వారికి కొద్ది దూరంలోని దిబ్బపాలెంలో ఉంటున్నాడు. అతను మూడు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ తల్లి నుంచి స్పందన లేకపోవడంతో అనుమానంతో శనివారం రాత్రి గొంతినవానిపాలెం వచ్చి చూడగా తల్లి లక్ష్మి మృతదేహం కనిపించింది. అతడి తమ్ముడు సంతోషరావు మరో గదిలో మంచంపై నిద్రిస్తూ ఉన్నాడు. దీంతో గాజువాక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. లక్ష్మి మృతిచెంది మూడు రోజులు దాటి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇండోర్ స్టేడియం అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శనివారం నూతనంగా ఏర్పాటైన భీమిలి ఇండోర్ స్టేడియం అభివృద్ధి కమిటీ సభ్యులు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గంటాను కలిసారు. ఈ సందర్భంగా ఆయన బిసా లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బిసా గౌరవాధ్యక్షుడు, టీడీపీ యువ నాయకుడు రవితేజ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి పూర్తి బాధ్యత తీసుకుంటానని చెప్పారు. బిసా అధ్యక్షుడు కారి ఈశ్వరరావు మాట్లాడుతూ స్టేడియంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే గంటాకు, గౌరవాధ్యక్షుడు రవితేజ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారు కైతపల్లి శ్రీనివాసరావు, జీవీఎంసీ స్పోర్ట్సు డైరెక్టర్ అప్పలరాజు, చిరంజీవి రాయల, అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ, కోశాధికారి వర్మ, ఉపాధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, సభ్యులు కాళ్ళ సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





కప్ప స్తంభం వద్ద అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ, సంగీత విద్వాంసుడు శివమణి

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో అనంతపురం జిల్లా పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, ప్రముఖ సంగీత విద్వాంసులు శివమణి, ప్రభుత్వ విప్‌లు పీజీవీఆర్ నాయుడు, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. వారికి దేవస్థానం ఈఓ ఎస్. సుజాత, డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత ఆలయ పండితులు చతుర్వేదాశీర్వచనాలివ్వగా, ఈఓ శాలువతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. పిల్లలు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలంటే అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలోని కాలేజీ రోడ్‌లో వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, నాయకులు బోని శ్రీను, సంకురుభుక్త రమేశ్, లచ్చుబోతు సంతోష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు ఇన్‌చార్జి షైలపల్లి షణ్ముఖరావు, షైలపల్లి భారతి, 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు ప్రతిపాదనలకు చెక్

... 5వ పేజీ తరువాయి

సరైన వివరాలు సమర్పించాలని కోరుతూ వాయిదా వేసింది. యోగాంధ్ర సందర్భంగా బీచ్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లు, కెర్బ్‌లకు రంగులు వేయడం, శుభ్రం చేయడం, వాహనాల పార్కింగ్‌కు మార్జిన్ వేయడం వంటి నాలుగు అంశాల్లో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నందున వాటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కోరాలని నిర్ణయించింది. అలాగే యోగాంధ్ర సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ పరిసరాల్లో ఉన్న కఠినమైన రాళ్లను తొలగించామని అందుకోసం సుమారు రూ.14 లక్షలు బిల్లు చెల్లించాలని కోరుతూ అజెండాలో చేర్చిన మూడు అంశాలపై సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో వాటిని స్వయంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సభ్యులు నిర్ణయించారు. అలాగే బీచ్‌రోడ్డులోని స్విలర్ స్వాన్ రెస్టారెంట్‌కు అదనంగా 460 చదరపు గజాలు ఇచ్చే అంశాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన మేయర్, ఆ స్థలంలో జీవీఎంసీయే స్వయంగా దుకాణాలు ఏర్పాటుచేసి వేలం నిర్వహించేలా ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశాలు జారీచేశారు. టేబుల్ అజెండాలోని 30 అంశాలు వార్డుల్లో అభివృద్ధికి సంబంధించినవే కావడంతో వాటిని కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. యోగాంధ్ర సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసిన పోర్టబుల్ టాయిలెట్లకు రూ.16 వేల చొప్పున అద్దె చెల్లించాలంటూ ప్రజారోగ్యం విభాగం అధికారులు రూ.1.62 కోట్ల మేర బిల్లు పెట్టారు. ఇందుకు సంబంధించిన 26 అంశాలపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రూ.నాలుగు వేల అద్దెకు గతంలో పోర్టబుల్ టాయిలెట్లను జీవీఎంసీ తీసుకుంటే..ఇప్పుడు ఏకంగా నాలుగు రెట్లు పెంచేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ప్రచారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో కమిటీ చైర్మన్ హోదాలో మేయర్‌తోపాటు సభ్యులు పది మంది కూడా తీవ్రస్థాయి ఆరోపణలు ఉన్నందున సమగ్ర వివరాలు అందజేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే భీమిలిలో చెత్త బదిలీ స్టేషన్ (జీటీఎస్)లో ఏర్పాటుచేసిన సీసీఎస్ ప్రాజెక్టును ప్రారంభించి ఏడాది అయిన తర్వాత ఇప్పుడు టెండర్లు పిలవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో కమిటీ సభ్యులు దీనిపై అధికారులను నిలదీశారు. సీసీఎస్ ప్రాజెక్టును కమిటీ పరిశీలించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రూ.14 లక్షలు ఖర్చుతో రాళ్ల తొలగించినట్టు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పెట్టడంపై కమిటీ సభ్యులు అవాక్కయ్యారు. ఏయూలో గతంలో ఎన్నోముఖ్యమైన సమావేశాలు, సదస్సులు జరిగాయని, అప్పుడు లేని రాళ్లు యోగాంధ్ర సమయంలో ఎలా వచ్చాయంటూ నిలదీశారు. బీచ్‌రోడ్డులో అనధికార దుకాణాలు వెలుస్తున్నాయని, వాటివల్ల జీవీఎంసీకి పైసా ఆదాయం రావడం లేదు కాబట్టి, అలాంటి దుకాణాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేసి అందజేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గెడ్డల్లో పూడికతీతకు జీవీఎంసీకి సొంతంగా జేసీబీలు, బాబ్‌కాట్‌లు ఉండగా, అద్దెకు యంత్రాలు తీసుకుంటున్నట్టు చూపించి బిల్లులు చెల్లించడం సరికాదని, ఇకపై అలాంటి ప్రతిపాదనలు పెట్టవద్దని ప్రజారోగ్యం, మెకానికల్ విభాగం అధికారులకు స్పష్టంచేశారు. ఏదైనా పనిచేస్తే ఏడాది తర్వాత బిల్లుకు ప్రతిపాదన పెడుతున్నారని, దీనివల్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇకపై నెల రోజుల్లో బిల్లు పెట్టాల్సిందేనని స్పష్టంచేశారు. కుక్కలకు ఆపరేషన్లు చేసే అంశంపై సభ్యులు అనుమానాలు వ్యక్తంచేయడంతో, వాటికి సంబంధించిన ఆధారాలను చూపిస్తామని అధికారులు సమాధానం ఇవ్వడంతో వాటిని ఆమోదించారు. పారిశుధ్య నిర్వహణకు తాత్కాలిక సిబ్బందిని నియమించినట్టు చూపించి బిల్లు పెట్టడంపై కమిటీలో వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు వస్తున్నందున, ఎవరిని విధుల్లోకి తీసుకున్నారో వారి గుర్తింపుకార్డులు, ఆధార్ కార్డులను కూడా ఫైల్‌లో పెట్టాలని మేయర్ ఆదేశించారు. నగరంలో అమూల్ సంస్థకు స్థలాల అద్దెను రెన్యువల్ చేసే అంశంపై చర్చ సందర్భంగా ఇకపై స్థానిక డెయిరీలకు అవకాశం కల్పించేలా ప్రతిపాదనలు తయారుచేయాలని జోన్-3 కమిషనర్‌కు మేయర్ సూచించారు. ఈ సమావేశంలో కమిటీసభ్యులతోపాటు అన్నివిభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్పైక్-26 టెక్నికల్ సింపోజియం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలం ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదో జాతీయ టెక్నికల్ సింపోజియం స్పైక్స్-26 పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. వచ్చే ఏడాది మార్చి 11 నుంచి 13వ తేదీ మధ్య మూడు రోజులపాటు దీనిని నిర్వహించనున్నారు. టెక్నికల్ పవర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, వర్క్‌షాప్ మొదలైనవి ఇందులో ఉంటాయి. దేశం నలుమూలల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు, పరిశోధకులు, టెక్నికల్ సింపోజియంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్ పి.స్వప్న, కన్వీనర్ ఎం.రమేష్ పట్నాయక్, సహ కన్వీనర్ డాక్టర్ డైసీరాణి, విద్యార్థి కో-ఆర్డినేటర్ ఎ.శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా రోలర్ బాస్కెట్‌బాల్‌లో

అన్నాచెల్లెళ్ల ప్రతిభ



పూజిత

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఇటీవల జరిగిన అంతర్ జిల్లా రోలర్ బాస్కెట్ బాల్ పోటీల్లో 10వ వార్డులోని రవీంద్రనగర్‌కు చెందిన అన్నాచెల్లెలు కనకల పూజిత, శేషు మంచి ప్రతిభాపాటవాలను కనబరిచారు. అండర్-11 కేటగిరిలో పూజిత స్వర్ణ చేజిక్కుంచుకున్నది. ఆమె సోదరుడు కనకల శేషు అండర్-14 కేటగిరిలో వెండి పతకం చేజిక్కించుకున్నాడు.

ఈ నెల 28 నుంచి 31వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరిద్దరూ ప్రాతినిధ్య వహించనున్నారు.కాగా, తమ పిల్లల విజయం తమకెంతో ఆనందం కలిగించిందని వీరిద్దరి తండ్రి, పీఎం పాలెం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నరసింహమూర్తి అన్నారు.



కనకల శేషు

సినిమా గైడ్

● **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).

● **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).

● **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ).

● **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ

● **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా

● **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి

● **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు)46, గుత్తి/రవి వంకాయలు 42, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్28, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7,మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 60, బరబాటి 42, పోటల్స్ 50, ముల్లంగి30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 40, దోసకాయలు 22, పొటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 60, పచ్చ బటానీ 90, గోరుచిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

అంబేడ్కర్ బాట అనుసరణీయం

» మేయర్ పీలా
» పలు చోట్ల వర్ధంతి కార్యక్రమాలు



ఏయూలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రొఫెసర్లు, తదితరులు



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏడీసీ రమణమూర్తి

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అన్ని వర్గాలకు సమానత్వం కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, వారి జీవితాలలో వెలిగి నింపినఅంబేడ్కర్ ఈ పుడమి ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలచి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ సూపరింటెండెంట్లు రియాజ్, శ్రీనివాస్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో..

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపినమార్గంలో ముందుకు సాగాలని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏయూ పరిపాలనా భవనం, న్యాయ కళాశాల వద్ద ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఎన్నో అవాంతరాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ ప్రణాళిక చేపట్టి పూర్తిచేసిన ఆయన శక్తి గర్వకారణమన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం వల్లే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్, ప్రిన్సిపాళ్లు ఎంవీఆర్ రాజు, కె. సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ప్రొఫెసర్ పద్మశ్రీ, షారోన్‌రాజు, ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం, ప్రొఫెసర్ జి.సుధాకర్, డి.సింహాచలం,ఎన్.విజయమోహన్, ధనరాజ్,డీన్లు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాటం చేసిన మహానాయకుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పెదగదిలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకుడు, 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, బడుగు, గిరిజన, బలహీన వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు అందడానికి కారకుడు అంబేడ్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడచిన నాడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు.

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, ఎస్సీ సెల్ 12వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి గాడి సత్యం, నాయకులు ఒమ్మి అప్పలరాజు, మద్దిల రాజశేఖర్, ఒమ్మి పోలారావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో...

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉషోదయ కూడలిలోని ప్రాంతీయ కేంద్రంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక అతిథిగా ఆచార్య బి.ఈశ్వర్ పాల్గొన్నారు. ఇగ్నో అదనపు సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, విభాగధిపతి వీవీ పతిరావునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికో పరిమితం అయిన వ్యక్తి కాదని, ఆయన ఆధునిక భారత నిర్మాత అని పేర్కొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని టీడీపీ నాయకులు సిద్ధార్థనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాజ్యాంగ రూపశిల్పిగా, రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కుల వివక్షపై గళమెత్తడమే కాకుండా సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన మహోన్నతి వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, సీతారామ్, అప్పలరాజు, రమణమ్మ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో..

బీచ్ రోడ్డు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం బీచ్ రోడ్డు వద్ద జైభీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ ఉండేలా ప్రజాస్వామ్య సాధికారతకు అవసరమైన అమూల్య రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు.

అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ కోన ప్రకాశ్, ప్రతినిధులు భూపతి రావు, రమ్య, కోన శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించిన డాక్టర్ రమేశ్‌బాబు, జై భీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ కోసం టౌన్‌ప్లానింగ్ విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

» జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు



వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో గల పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రభుత్వం జీవో ఎంఎస్.నెం.225, ఎంఏ అండ్ యూడీ (ఎం) విభాగం నవంబరు 12, 2025 ప్రకారం నగర పాలక సంస్థలు(అర్బన్ లోకల్ బాడీస్) పరిధిలోని బిల్డింగ్స్ క్రమబద్ధీకరణకు (బీపీఎస్) స్కీమ్ ప్రభుత్వం విడుదల చేసిందని, అనుమతి లేకుండా కట్టిన బిల్డింగ్స్, ప్లాన్స్‌కు డివియేషన్ ఉన్న బిల్డింగ్స్ ఒకేసారి రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీముల కు సంబంధించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అలాగే ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఆమోదం పొందని లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ నిబంధనలు, 2020ను సవరించి, జీవో నెం.134, ఎంఏ అండ్ యూడీ (ఎం) విభాగం జూలై 26, 2025 ప్రకారం దరఖాస్తుదారు జీవో జారీ చేసిన తేదీ నుంచి 90 రోజుల ముందు, అక్టోబరు 25, 2025లోపు దరఖాస్తు చేసుకోవాలని, స్వీకరించిన దరఖాస్తులను ఏప్రిల్ 25, 2026లోపు పరిష్కరించాలన్నారు.

తదుపరి ప్రభుత్వం జీవో నెం.1173 ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకునేందుకు 2026, జనవరి 23 వరకు పొడిగించారన్నారు. కాబట్టి జీవీఎంసీలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ 2025, అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్ల నియంత్రణ నియమాలు 2020ను సమర్థవంతంగా అమలు చేయడానికి, ఉన్నత అధికారుల సూచనల ప్రకారం, ప్రజలను మరింత ప్రోత్సహించడానికి, ఈ కార్యాలయ పనివేళల్లో బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై ప్రజలకు అవగాహన కల్పించి సహాయం అందించడానికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రజల సౌకర్యార్థం టౌన్ ప్లానింగ్ సిబ్బందితో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యాలయం హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 9154282649, 9154282654లుగా వెల్లడించారు. ఈ అవకాశాన్ని జీవీఎంసీ పరిధిలో గల ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలని సీసీపీ ప్రకటనలో పేర్కొన్నారు.

పైనాపిల్ కాలనీలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

» భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ కంపెనీలు, కార్యాలయాల్లో పనిచేసే మహిళలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు ఎంతో మేలు చేస్తాయని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. పైనాపిల్ కాలనీలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ మహిళలకు అందుబాటు ధరల్లో వసతి కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. భవిష్యత్తులో ఐటీ, ఫార్మా, ఇతర సేవా రంగాల్లో మహిళలకు వేలాదిగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా ఇక్కడ పని చేసుకుంటూ హాస్టల్స్‌లో ఉండేందుకు వీలుంటుందన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకు రావడం సీఎం చంద్రబాబు సమర్థతకు నిదర్శనమన్నారు. నగర పరిధిలో మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మించేందుకు అనుమతి లభించగా ఎంపీ చొరవతో తూర్పు, భీమిలి, గాజువాక పరిధిలో నిర్మిస్తున్నారన్నారు. 13 వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌కార్గ్, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, టీడీపీ నేతలు ఒమ్మి సన్యాసిరావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో విజయవంతంగా

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో డి.విజయలక్ష్మి(44) అనే మహిళకు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. తీవ్ర సమస్యతో కేజీహెచ్‌కు వచ్చిన ఆమెను పరీక్షించిన వైద్యులు కిడ్నీ మార్పిడి అవసరమని సూచించారు. ఆమె సమీప బంధువు కిడ్నీ దానం చేయడంతో గత నెలలో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆమె కోలుకుని ఈ నెల 5న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఇలాంటి శస్త్రచికిత్స ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఇప్పటి వరకు చేయలేదని పేర్కొన్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన నెఫ్రాలజీ విభాగం వైద్యులు డాక్టర్ రత్నప్రభ, యూరాలజీ విభాగాధి పతి డాక్టర్ ఐ.చంద్రశేఖర్, అనస్థీషియా వైద్యులు కె.లక్ష్మి, డాక్టర్ జీవీగణేష్, వైద్య సిబ్బందిని కేజీహెచ్‌సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అభినందించారు. ఇలాంటి శస్త్ర చికిత్సలు నిర్వహించటం అభినంద నీ యమని, నెఫ్రాలజీ విభాగం సేవలను ప్రజలు వినియోగించుకోవాలనిఆమె కోరారు.

నయనానందకరంగా భరతనాట్య ప్రదర్శనలు

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నయనాల కదలికలు కట్టిపడేశాయి. ముఖ హావభావాలు మనసులను కొల్లగొట్టాయి. బృంద నాట్యాలు కనువిందుగా నిలిచాయి. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నాట్యమణులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలు కళాభిమానులను మైమరపించాయి. నాట్య కళాక్షేత్ర సంగీత నృత్యయ సంస్థ 25వ వార్షికోత్సవంలో భాగంగా 'నాట్యాంజలి' పేరిట ప్రదర్శించిన నాట్యాలు నయనమనోహరంగా సాగాయి. గణేశ స్తుతిలో 12 మంది విద్యార్థినుల నృత్యానికి చప్పట్ల వర్షం కురిసింది. కల్యాణి రాగంలో, మిశ్రచాపు తాళంలో పది మంది విద్యార్థినులు ప్రదర్శించిన అలరింపు కనువిందు చేసింది. హస్విక యుగళం ప్రదర్శించిన నాట్యం అలరించింది. కె.మాదవి అభినయించిన నృత్యాలకు చప్పట్లు మారుమోగాయి. వి.కమలశ్వేతిక భరతనాట్యం ఆకట్టుకుంది. జయజయ దుర్గా, దేవీ స్తుతి, శంకరశ్రీగిరి, హనుమాన్ చాలీసా కృతులకు ప్రదర్శించిన నాట్యాలు కళ్లకు ఇంపుగా అనిపించాయి.



భరతనాట్య ప్రదర్శనలో కళాకారిణుల హావభావాలు



నృత్యం చేస్తున్న కళాకారిణులు

వినియోగదారులకు అందుబాటులో

లాజిస్టిక్స్ సేవలు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, పార్శిల్ భద్రత, రవాణా సమయం వినియోగదారులకు తెలియజేయాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. మద్దిలపాలెం,గాజువాక లాజిస్టిక్స్ కార్యాలయాలను శనివారం ఆయన సందర్శించారు. పాతగాజువాకలోని లాజిస్టిక్స్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. గాజువాక ప్రాంతంలో చిన్న,మధ్య తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని,ఫార్మాసిటీ అందుబాటులో ఉందని వీటికి సంబంధించిన ముడి సరుకుల, ఉత్పత్తుల రవాణా గురించి సంబంధిత యాజమాన్యాలతో సంప్రదించాలన్నారు.

'కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని ఏయూ మాజీ వైస్ చాన్సలర్, సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. శనివారం ఏయూ ఈసీఈ విభాగంలో నిర్వహించిన విభాగ పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థి దశలోనే అలవర్చుకోవాలన్నారు. ఉన్నతంగా రాణించాలంటే కష్టపడాలన్నారు. విద్యార్థులు నిత్యం తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈసీఈ విభాగ ఆవిర్భావం, ప్రగతిని వివరించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లా డుతూ ప్రతీ వ్యక్తికి సహాయం చేసే తత్వం ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు నుంచి నేర్చుకోవాలన్నారు. విభాగానికి మార్గదర్శిగా, స్ఫూర్తిని అందించే వ్యక్తిగా నిలుస్తారన్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పీవీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థిగా, పరిశోధకురాలిగా, సహోద్యోగిగా ప్రొఫెసర్ రాజుతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పి.రాజేష్‌కుమార్, డాక్టర్ ఎస్.అరుణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విభాగ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించి పలు మౌలిక వసతులను సమకూర్చిన 1989-93 బ్యాచ్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మరోమలుపు పుస్తకావిష్కరణ



మరో మలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎల్.కృష్ణమూర్తి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఇతర ప్రముఖులు

సిరిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన భీమరశెట్టి రమణి రాసిన మరో మలుపు పుస్తకాన్ని ప్రముఖ నేత్రవైద్యులు ఎల్.కృష్ణమూర్తితో కలసి పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. శనివారం ఏయూలోని హిందీ భవనల్‌లో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్‌తో పోరాడి జయించిన భీమరశెట్టి రమణి తన స్వానుభవాన్ని అందరికీ తెలిసేలా గ్రంథావిష్కరణ చేయడం అభినందనీయమన్నారు. క్యాన్సర్ వ్యాధి అంటే భయపడే వారికి ఈ పుస్తకం ధైర్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.రజని, ఏయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు, డాక్టర్ ఉమాశంకర్ తదితరులు ప్రసంగించారు. పుస్తక రచయిత రమణి మాట్లాడుతూ మానవ శరీరం ఓ ప్రయోగశాల వంటిందని, క్యాన్సర్ శిక్షగా కాకుండా ఇదో శిక్షణగా భావించి జయించాలని, ఇదే తన 'మరోమలుపు' పుస్తక ఇతివృత్తమన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

'యాదవులపై చిన్నచూపు తగదు'

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం యాదవులపై చిన్నచూపు చూస్తోందని, ఇది దురదృష్టకరమని వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నగరంలో యాదవులకు ఉన్నత పదవులు కట్టబెట్టారన్నారు. వుడా చైర్మన్, నగర మేయర్, ఎమ్మెల్సీ, మరెన్నో సంస్థల్లో డైరెక్టర్లుగా యాదవులను నియమించారని గుర్తు చేశారు. యాదవుల కోసం నగరం మధ్యలో 50 సెంట్లు స్థలం కేటాయించి యాదవ సామాజివర్గానికి అగ్రస్థానం కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం యాదవులను విస్మరిస్తోందని ఆరోపించారు.


ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి


డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ నేతల నివాళి


డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న సీపీఐ నాయకులు


సాగరతీరాన్ని శుభ్రపరచిన జైభీమ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

బి.ఆర్.అంబేడ్కర్ పోరాటం ఆదర్శప్రాయం

» రాజ్యాంగ నిర్మాతకు వివిధ ప్రాంతాల్లో పలువురి ఘన నివాళి

సీతమ్మధార/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/మహారాణిపేట/అక్కయ్యపాలెం/మాధవధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన పోరాటం తరతరాలకు ఆదర్శప్రాయమని ఏపీఈపీడీసీఎల్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ ఇమ్మడి పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సీతమ్మధారలోని ఆ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ నగర అధ్యక్షుడు పరుశురామరాజు అన్నారు. డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో జయంతి, వర్ధంతులు అధికారికంగా నిర్వహిస్తున్న ఒకే ఒక్క నాయకుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నాయకులు సాగి కాశీవిశ్వనాథరాజు, ఎం.ప్రకాష్, శంకరరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనార్టీలు, బీసీలకు సామాజిక న్యాయం ఉండాలన్న సంకల్పంతో రాజ్యాంగంలో అనేక అంశాలు పొందుపరిచారని అన్నారు. అందువల్ల మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాయకులు కె.సత్యనారాయణ, చంద్రశేఖర్, బేగం, నాగభూషణ్ పాల్గొన్నారు.

సమాజ మార్పునకు అంబేడ్కర్ కృషి

అసమానతలతో ఉన్న సమాజాన్ని మార్చేందుకు ఎంతో శ్రమించిన మహానేత డా.అంబేడ్కర్ అని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్ ప్రసాద్ కొనియాడారు. జ్ఞానాపురంలోని కాన్వెంటు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీచ్ పరిశుభ్రత

జై భీమ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగరతీరంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఆశయాల్లో భాగంగా 'పే బ్యాక్‌టూ సొసైటీ' నినాదంతో జై భీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో తొలుత బీచ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ యువత సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని సూచించారు. గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, సభ్యుడు కోన ప్రకాష్ ఆకుల శ్రీనివాసరావు, చిరంజీవి, విజయలక్ష్మి, సంతోష్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

గ్రేటర్ 46వ వార్డులో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కస్తూరినగర్‌లో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు మారడపూడి ఆనంద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఆవాల నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార అంబేడ్కర్ కాలనీలో...

మాధవధార అంబేడ్కర్ కాలనీలో కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ కార్యక్రమానికి అతిథిగా హాజరై అంబేడ్కర్ స్మారక విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాల్ని కొనియాడారు. వైసీపీ నాయకులు, మహిళలు హాజరయ్యారు.

జేబుదొంగలతో జాగ్రత్త


సీతమ్మధార రైతుబజార్‌లో ప్లకార్డుల ప్రదర్శిస్తున్న రైతులు, పోలీసు అధికారులు

సీతమ్మధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతు బజార్‌లనే లక్ష్యంగా చేసుకొని జేబు దొంగలు చేతివాటం చూపుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ ఎస్ఐ రవికుమార్ సూచించారు. అనుమానితులను గుర్తిస్తే ప్రశ్నించాలని పేర్కొన్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో రైతులకు, కొనుగోలుదారులకు జేబుదొంగల ప్రవర్తనపై అవగాహన కల్పించారు. అనుమానితులను గుర్తిస్తే రైతుబజార్ కార్యాలయం వద్ద తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మెగా విశాఖ?

... 5వ పేజీ తరువాయి

విలీనం అయితే జిల్లా మొత్తం నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చేసినట్టవుతుంది. జీవీఎంసీ జనాభా ప్రస్తుతం 21 లక్షలు ఉన్నారు. ఇప్పుడు కొత్తగా నాలుగు మండలాలు విలీనమైతే వాటి పరిధిలోని 87 గ్రామాల్లో గల సుమారు నాలుగు లక్షల మందిని కలుపుకుని జనాభా సంఖ్య 25 లక్షలు దాటుతుంది. జీవీఎంసీలో నాలుగు మండలాల విలీనం ప్రక్రియ మొదలైతే ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మృతదేహంతో మూడు రోజులు

... 5వ పేజీ తరువాయి

పచ్చికోరు లక్ష్మి (65), తన చిన్న కుమారుడు సంతోషరావుతో కలిసి నివసిస్తోంది. పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వారికి కొద్దిదూరంలోని దిబ్బపాలెంలో ఉంటున్నాడు. అతను గత మూడు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ తల్లి నుంచి స్పందన లేకపోవడంతో అనుమానంతో శనివారం రాత్రి గొంతినవానిపాలెం వచ్చి చూడగా తల్లి లక్ష్మి మృతదేహం కనిపించింది. అతడి తమ్ముడు సంతోషరావు మరో గదిలో మంచంపై నిద్రిస్తూ ఉన్నాడు. దీంతో గాజువాక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. లక్ష్మి మృతిచెంది మూడు రోజులు దాటి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వార్ వన్‌సైడ్

... 5వ పేజీ తరువాయి

కరతాళ ధ్వనులతో స్టేండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఇక మూడో మ్యాచ్‌లోనూ రోహిత్ శర్మ అర్ధసెంచరీ సాధించాడు. 25 ఓవర్ల వరకు ఓపెనర్ల దూకుడు కొనసాగింది. 54 బంతుల్లో ఆరు బౌండరీలు, సిక్సర్‌తో రోహిత్ తన కెరీర్‌లో 61వ అర్ధ సెంచరీ పూర్తిచేయగా...మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ 75 బంతుల్లో మూడు బౌండరీలు, సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తిచేశాడు. జోరుమీదున్న రోహిత్ శర్మ వ్యక్తిగత 75 పరుగులవద్ద తొలి వికెట్‌గా వెనుతిరగడంతో బ్యాటింగ్‌కు దిగిన విరాట్ కోహ్లీ తొలి బంతి నుంచీ స్కోరు బోర్డు పరుగులెత్తించాడు. ఈ దశలో యశస్వి జైస్వాల్ 111 బంతుల్లో పది ఫోర్లు, సిక్సర్‌తో వన్డే కెరీర్‌లో ఏడో సెంచరీ పూర్తిచేశాడు. విరాట్ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 53వ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నిగిడి వేసిన 40 ఓవర్‌లో విరాట్ కోహ్లీ బౌండరీ బాది మ్యాచ్‌ను విజయవంతంగా ముగించాడు.

కనువిందు చేసిన విరాట్, రోహిత్

ప్రేక్షకుల కల నెరవేరింది. అభిమాన క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల బ్యాటింగ్ చూసేందుకు అష్టకష్టాలు పడి టికెట్లు సాధించుకున్న వారి ఆశ తీరింది. వీరిద్దరూ తమదైన శైలి బ్యాటింగ్‌తో ప్రేక్షకులకు కనువిందు చేశారు. సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించారు. విరాట్, రోహిత్, జైస్వాల్ బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లకు చూపిస్తుంటే ప్రేక్షకులు కేరింతలతో స్టేడియంను హోరెత్తించారు. వీరు ముగ్గురూ బ్యాటింగ్ చేస్తున్నంత సేపూ స్టేడియంలోని ప్రేక్షకులంతా కుర్చీల్లోంచి లేచి నిలబడి మరీ తిలకించడం విశేషం.

అడ్డగోలు ప్రతిపాదనలకు చెక్

... 5వ పేజీ తరువాయి

సరైన వివరాలు సమర్పించాలని కోరుతూ వాయిదా వేసింది. యోగాంధ్ర సందర్భంగా బీచ్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లు, కెర్బ్‌లకు రంగులు వేయడం, శుభ్రం చేయడం, వాహనాల పార్కింగ్‌కు మార్జిన్ వేయడం వంటి నాలుగు అంశాల్లో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నందున వాటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కోరాలని నిర్ణయించింది. అలాగే యోగాంధ్ర సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాటుచేసిన హెలీపాడ్ పరిసరాల్లో ఉన్న కఠినమైన రాళ్లను తొలగించామని అందుకోసం సుమారు రూ.14 లక్షలు బిల్లు చెల్లించాలని కోరుతూ అజెండాలో చేర్చిన మూడు అంశాలపై సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో వాటిని స్వయంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సభ్యులు నిర్ణయించారు. అలాగే బీచ్‌రోడ్డులోని స్విలర్ స్వాన్ రెస్టారెంట్‌కు అదనంగా 460 చదరపు గజాలు ఇచ్చే అంశాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన మేయర్, ఆ స్థలంలో జీవీఎంసీయే స్వయంగా దుకాణాలు ఏర్పాటుచేసి వేలం నిర్వహించేలా ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశాలు జారీచేశారు. టేబుల్ అజెండాలోని 30 అంశాలు వార్డుల్లో అభివృద్ధికి సంబంధించినవే కావడంతో వాటిని కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. యోగాంధ్ర సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసిన పోర్టబుల్ టాయిలెట్లకు రూ.16 వేల చొప్పున అద్దె చెల్లించాలంటూ ప్రజారోగ్యం విభాగం అధికారులు రూ.1.62 కోట్ల మేర బిల్లు పెట్టారు. ఇందుకు సంబంధించిన 26 అంశాలపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రూ.నాలుగు వేల అద్దెకు గతంలో పోర్టబుల్ టాయిలెట్లను జీవీఎంసీ తీసుకుంటే..ఇప్పుడు ఏకంగా నాలుగు రెట్లు పెంచేయడం వెనుక పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ప్రచారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో కమిటీ చైర్మన్ హోదాలో మేయర్ తోపాటు సభ్యులు పది మంది కూడా తీవ్రస్థాయి ఆరోపణలు ఉన్నందున సమగ్ర వివరాలు అందజేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే భీమిలిలో చెత్త బదిలీ స్టేషన్ (జీటీఎస్)లో ఏర్పాటుచేసిన సీసీఎస్ ప్రాజెక్టును ప్రారంభించి ఏడాది అయిన తర్వాత ఇప్పుడు టెండర్లు పిలవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో కమిటీ సభ్యులు దీనిపై అధికారులను నిలదీశారు. సీసీఎస్ ప్రాజెక్టును కమిటీ పరిశీలించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రూ.14 లక్షలు ఖర్చుతో రాళ్లు తొలగించినట్టు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పెట్టడంపై కమిటీ సభ్యులు అవాక్కయ్యారు. ఏయూలో గతంలో ఎన్నోముఖ్యమైన సమావేశాలు, సదస్సులు జరిగాయని, అప్పుడు లేని రాళ్లు యోగాంధ్ర సమయంలో ఎలా వచ్చాయంటూ నిలదీశారు. బీచ్‌రోడ్డులో అనధికార దుకాణాలు వెలుస్తున్నాయని, వాటివల్ల జీవీఎంసీకి పైసా ఆదాయం రావడం లేదు కాబట్టి, అలాంటి దుకాణాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేసి అందజేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గెడ్డల్లో పూడికతీతకు జీవీఎంసీకి సొంతంగా జేసీబీలు, బాబ్‌కాట్‌లు ఉండగా, అద్దెకు యంత్రాలు తీసుకుంటున్నట్టు చూపించి బిల్లులు చెల్లించడం సరికాదని, ఇకపై అలాంటి ప్రతిపాదనలు పెట్టవద్దని ప్రజారోగ్యం, మెకానికల్ విభాగం అధికారులకు స్పష్టంచేశారు. ఏదైనా పనిచేస్తే ఏడాది తర్వాత బిల్లుకు ప్రతిపాదన పెడుతున్నారని, దీనివల్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇకపై నెల రోజుల్లో బిల్లు పెట్టాల్సిందేనని స్పష్టంచేశారు. కుక్కలకు ఆపరేషన్లు చేసే అంశంపై సభ్యులు అనుమానాలు వ్యక్తంచేయడంతో, వాటికి సంబంధించిన ఆధారాలను చూపిస్తామని అధికారులు సమాధానం ఇవ్వడంతో వాటిని ఆమోదించారు. పారిశుధ్య నిర్వహణకు తాత్కాలిక సిబ్బందిని నియమించినట్టు చూపించి బిల్లు పెట్టడంపై కమిటీలో వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు వస్తున్నందున, ఎవరిని విధుల్లోకి తీసుకున్నారో వారి గుర్తింపుకార్డులు, ఆధార్ కార్డులను కూడా ఫైల్‌లో పెట్టాలని మేయర్ ఆదేశించారు. నగరంలో అమూల్ సంస్థకు స్థలాల అద్దెను రెన్యువల్ చేసే అంశంపై చర్చ సందర్భంగా ఇకపై స్థానిక డెయిరీలకు అవకాశం కల్పించేలా ప్రతిపాదనలు తయారుచేయాలని జోన్-3 కమిషనర్‌కు మేయర్ సూచించారు. ఈ సమావేశంలో కమిటీసభ్యులతోపాటు అన్నివిభాగాల అధికారులు పాల్గొన్నారు.

24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలిగా బర్ల పద్మలత



సీతమ్మధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు టీడీపీ అధ్యక్షురాలిగా బర్ల పద్మలత ఎన్నికయ్యారు. ఎంపీ శ్రీభరత్ ఆమెకు శనివారం నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బర్ల పద్మలత తెలిపారు.

25వ వార్డుకు ఇసరపు వాసు


వాసుని అభినందిస్తున్న కార్యకర్తలు

సీతంపేట: గ్రేటర్ 25వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఇసరపు వాసును నియమించారు. ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. వాసును పుష్పగుచ్ఛంతో పలువురు అభినందించారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

సీతమ్మధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి శనివారం ప్రారంభించారు. రక్తదానం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సమాజ సేవలో భాగస్వాములు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. సీఎండీ పృథ్వీతేజ్ రక్తదానం చేసి స్ఫూర్తి నింపారు. వివిధ విభాగాల డైరెక్టర్లు టి.వనజ, టీవీ సూర్యప్రకాష్, ఎస్.హరిబాబు, సీజీఎంలు వి.విజయలలిత, బి.అశోక్‌కుమార్, డి.సుమన్, కల్యాణి, జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మహిళకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో డి.విజయలక్ష్మి (44) అనే మహిళకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. తీవ్ర సమస్యతో కేజీహెచ్‌కు వచ్చిన ఆమెను పరీక్షించిన వైద్యులు కిడ్నీ మార్పిడి అవసరమని సూచించారు. ఆమె సమీప బంధువు కిడ్నీ దానం చేయటంతో గత నెలలో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆమె కోలుకుని ఈ నెల 5న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్యబృందం సభ్యులు రత్నప్రభ, డాక్టర్ ఐ.చంద్రశేఖర్, కె.లక్ష్మి, జీవీ గణేష్, వైద్యసిబ్బందిని కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఐ.వాణి అభినందించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నేడు

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాండురంగాపురం బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. కేజీహెచ్ పూర్వ సీనియర్ వైద్యాధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తారన్నారు. పాత డాక్టర్ చీటీలు తీసుకురావాలని సూచించారు.

సైన్స్ ఫెస్టివల్‌కు ఆహ్వానం

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చండీఘడ్‌లో జరుగుతున్న నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ ఇనిస్టిట్యూషన్స్ మీట్‌కు ఏపీ నుంచి విశాఖకు చెందిన సోషియో ఎకనామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్‌కుమార్‌కు ఆహ్వానం అందింది.

ప్రజాదరణ ఉన్న సమర్థులకు టీడీపీలో గుర్తింపు

టీడీపీ ఉత్తర నియోజకవర్గ వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జుల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గంలోని వార్డుల కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో గండి బాబ్జి, ఇతర నేతలు

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచి నడవడిక, ప్రజాదరణ, సమర్థత కలిగిన నాయకులకు తెలుగుదేశం పార్టీలో ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన 17 వార్డుల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, సహ బూత్, యూనిట్ ఇన్‌చార్జుల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో శ్రీభరత్ మాట్లాడారు. 2029 లో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఉందని ఎంపీ అన్నారు. ఏడు నియోజకవర్గాల్లోనూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే మహా నగరపాలక సంస్థ ఎన్నికలలో సరైన వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చి గెలిపించుకోవాలని సూచించారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన వారికి నిరంతరం ప్రజలలో గౌరవం ఉంటుందని, ఎన్నికలలో నిలబెట్టే అభ్యర్థి గుణగణాల విషయంలో రాజీపడకూడదని స్పష్టంచేశారు. సరైన అభ్యర్థుల కోసం కసరత్తు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండిబాబ్జి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, పొలమరశెట్టి శ్రీనివాస్, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో నూతనోత్తేజం

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డులో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చేలా పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. వార్డుకు యువ కమిటీని ఏర్పాటు చేసింది. పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన కార్యకర్తలను కమిటీలో చేర్చారు. నూతనంగా ఏర్పాటైన సభ్యులు ఎంపీ శ్రీభరత్ సమక్షంలో శనివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడిగా బండి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా రమణ అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా యమున కుమారి, ఉపాధ్యక్షుడిగా కోటీశ్వరరావు, యువత అధ్యక్షుడిగా దేవుపల్లి జయప్రకాశ్, ఇతర సభ్యులను నియమించారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని నూతన కమిటీ పేర్కొంది. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన ఎంపీ శ్రీభరత్, నాయకులు గండిబాబ్జి, ఎన్.అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలు సదరన్ రైల్వే, సెంట్రల్ రైల్వే



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహించిన అఖిల భారత రైల్వే వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ శనివారం ముగిసింది. వాల్తేరు రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన టోర్నీ పురుషుల విభాగంలో సదరన్ రైల్వే 190 పాయింట్లతో చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, నార్తన్ రైల్వే 188 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. మహిళల విభాగంలో సెంట్రల్ రైల్వే 184 పాయింట్లతో చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకోగా, నార్త్ ఈస్ట్రన్ రైల్వే 174 పాయింట్లతో రన్నరప్ సాధించింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వరన్ ఫంక్వాల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, స్పోర్ట్స్ ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష పాల్గొన్నారు.

ఘనంగా కేవీ-1 వార్షిక క్రీడోత్సవం


గౌరవ వందనం స్వీకరిస్తున్న కమడోర్ శ్రీఅనూప్ జాయ్

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక 104 ఏరియా వద్ద కేంద్రీయ విద్యాలయం-1 వార్షిక క్రీడోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కమడోర్ శ్రీఅనూప్ జాయ్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కమడోర్ అనూప్ శ్రీజాయ్ మాట్లాడుతూ...క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్పిస్తాయన్నారు. దేశభక్తిని పెంపొందించడంలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లో చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ ఏడాది కేవీఎస్ నుంచి 17 మంది విద్యార్థులు నేషనల్స్‌లో పాల్గొనగా 12 మంది రజత పతకాలు సాధించారన్నారు. విజేతలకు బహుమతులు, మెమొంటోలను అందజేశారు. కీడా విభాగం ఇన్‌చార్జి ఐ.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నిరాశ్రయులను పలకరించిన సీపీ


ఓ వృద్ధుని శాలువాతో సత్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం అధికార విధుల్లో బిజీగా ఉండే నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జీవీఎంసీ భీమ్‌నగర్, టీఎస్సార్ నిరాశ్రయుల గృహాన్ని శనివారం సందర్శించారు. షెల్టర్‌లోని నిరాశ్రయులకు శాలువాలు కప్పి, ఆహారాన్ని అందజేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కొందరిని ఆప్యాయంగా పలకరించి శాలువా కప్పి సత్కరించారు. యాచకులు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తలపెట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆయన షెల్టర్లను సందర్శిస్తున్నారు. వ్యక్తిగతంగా సేవా కార్యక్రమాల్లో మమేకంకావడం ఆయన అలవాటు. టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు, జీవీఎంసీ ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమం సామాజిక బాధ్యత

అల్లిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. శనివారం వార్డులోని బీమ్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా, శిశు సంక్షేమానికి అందిస్తున్న సహకారం, పథకాలను వివరించారు. మహిళల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అంగన్వాడీ టీచర్లు పర్విన్, పార్వతిదేవి, వాసవ్య, షర్మిల, కుమారి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కోటేశ్వరరావు కన్నుమూత

● ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో పాటు పలువురు ప్రముఖుల నివాళి

గన్నవరం/విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కోటేశ్వరరావు(74) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు వ్యాపార రీత్యా 30 ఏళ్లుగా విశాఖపట్నంలో స్థిరపడ్డారు. టీడీపీ ఆవిర్భావం నుంచి గన్నవరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషిచేశారు. వసంత నాగేశ్వరరావు, దేవినేని నెహ్రూ, దేవినేని రమణ వంటి నాటి ప్రముఖులతో సత్సంబంధాలు ఉండేవి. విశాఖపట్నం వెళ్లిన తరువాత కూడా టీడీపీ కోసం పనిచేశారు. మర్లపాలెంలో కోటేశ్వరరావు భౌతికకాయానికి విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జీవీఎంసీ మాజీ కార్పొరేటర్ ఆళ్ల వాసు, గన్నవరం మాజీ ఎమ్మెల్యేలు ముసునూరు రత్నబోస్, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, విజయ విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు.


కంభంపాటి కోటేశ్వరరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు (ఇన్‌సెట్‌లో) కోటేశ్వరరావు (ఫైల్ ఫొటో)

కాలువల్లో చెత్త వేయరాదు

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని ఏఎంవోహెచ్ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. జీవీఎంసీ 70వ వార్డు శ్రీనివాసనగర్‌తో పాటు పలు కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. రహదారులు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తడి-పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. దుర్గంధం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి సూచించారు.

ల్యాబ్‌కు సామగ్రి వితరణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ల్యాబ్ సామగ్రిని ఎన్టీపీసీ సంస్థ అందజేసింది. శనివారం కళాశాలలకు వచ్చిన ఎన్టీపీసీ అధికారులు ల్యాబ్ సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఎన్టీపీసీ అధికారులు ప్రకాశ్, శివమ్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తమ సంస్థ ద్వారా అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వివేకానందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక మంత్రికి వినతి

అగనంపూడి,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాంశెట్టి సుభాశ్‌కు స్థానిక కార్మిక సంఘాల నాయకులు శనివారం నగరంలో కలిసి వినతిపత్రం అందించారు. నగరంలో కార్మిక శాఖ భవనాన్ని నిర్మించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలను అమలు చేసే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్మిక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పరిశ్రమల్లో నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో కార్మిక సంఘాల నేతలు నాగార్జున, సత్యనారాయణ, రామ్మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అన్న క్యాంటీన్లు తనిఖీ

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలిని తీర్చే వేదికగా అన్న క్యాంటీన్లు నిలుస్తున్నాయని టీడీపీ 63వ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు అన్నారు.గాజువాకలో గల అన్న క్యాంటీన్‌లను ఆయన కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. రుచి, శుభ్రత, నాణ్యతతోనే కూడిన భోజనం ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే పరమ విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

పెందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెర్రిపోతులపాలెంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మడక అప్పలరాజు ఈ శిబి రాన్ని ప్రారంభించారు. వైద్యులు 32 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో సజ్జా శ్రీనివాసరావు, ప్రాంతీయ పశువుల ఆస్పత్రి వైద్యుడు రవికుమార్, విశాఖ జిల్లా సహాయక సంచాలకుడు ప్రసాదరావు, జగన్మోహనరావు, సౌజన్య, నాయుడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఏ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ).
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 46, గుత్తి/రవి వంకాయలు 42, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, బజ్జీ పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24,కాలీఫ్లవర్ 28, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 60, బరబాటి 42, పోటల్స్ 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 40, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 60, గ్రీన్‌పీస్ బటాని 90, గోరు చిక్కుడు 50, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన 5, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270



గాజువాక : అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్



ఉక్కుటౌన్‌షిప్ : కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ జీఎం ఎంఎం రావు



కూర్మన్నపాలెం : కణితిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

అంబేద్కర్ సేవలు నిరుపమానం

- వర్ధంతి సందర్భంగా పలువురి నివాళి

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శనివారం నిర్వహించారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాజువాక వంద అడుగుల రోడ్డులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 72వ వార్డు అంబేద్కర్ జగజ్జీవన్ రామ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్‌లు స్టాలిన్, రామారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరి వాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి, వడ్లపూడి, సిద్దార్థ నగర్‌లో నిర్వహించిన అంబేద్కర్ 69 వర్ధంతి కార్యక్రమాల్లో శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డ గోవింద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, బొట్టా ప్రకాష్,జాన్ రమేష్, దానప్పలు, సూరిశెట్టి పెంటారావు, మాటూరి రాము, కర్రి కృష్ణ ఆనంద్ పాల్గొన్నారు.

అలాగే జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెంలో పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు కేబీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వుడా నగర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో కణితి ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల నాగిరెడ్డి, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, దళిత నాయకులు మాటూరి శ్రీనివాసరావు పాల్గొని అంబేద్కర్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చేగొండి శ్రీనివాస్, భూపతిరాజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో..

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్టీల్‌ప్లాంటులోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎంఎం రావు, లైజన్ అధికారి సుందరం, బాబునాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ప్రతినిధులు సురేష్‌బాబు, మోహన్‌బాబు, గణేష్‌పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రం జంక్షన్ కూడలిలో గల మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి జగన్నాథస్వామి ఆలయ కమిటీ చైర్మెన్ కరణం పైడిరాజు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేటి యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పలువురి పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు, కోసూరి తాతారావు, జగదీశ్, ముత్యాల అప్పారావు, శ్రీను, మాధవ్, వర్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాలతో అపర మేధావిగా కీర్తింపబడిన అంబేద్కర్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణమని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాం ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు పెట్లి అర్జున్, ఈతలపాక మంగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. భెల్-హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భెల్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి భెల్ ఏజీఎం ఎస్.లీల పాల్గొని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్.చంద్రశేఖర్, కొల్లి దేములు, బొండా బాబూరావు, పీవీఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందజేస్తున్న 77వ వార్డు కూటమి నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 77వ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ టీడీపీ వార్డు అధ్యక్షుడు మంత్రి రవి, జనసేన నాయకులు కాకి బాబు నేతృత్వంలో నాయకులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ వార్డులో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇంకా మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్వరే ఆలం, నూకరెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

అయ్యప్పకు లక్ష మల్లెలతో అర్చన



అయ్యప్పస్వామికి లక్ష మల్లెలతో అర్చన చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అయ్యప్పస్వామికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. అయ్యప్పస్వామికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకించి అనంతరం కేరళ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు.

సింహపురి కాలనీలో వివాహిత హత్య

వేపగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నపాలెం దరి సింహపురి కాలనీలో ఓ వ్యక్తి వివాహితను హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సింహపురి కాలనీలోని వరాహ సూపర్ బజారు వెనుక ఉన్న అపార్ట్‌మెంట్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తి, ఓ మహిళతో కలిసి రెండు నెలలుగా సహ జీవనం చేస్తున్నాడు. ఇద్దరికీ గతంలో వివాహాలు జరిగాయి. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వారు ఉన్న ప్లాట్‌లో ఇద్దరూ గొడవ పడడం వాచ్‌మెన్ గమనించాడు. ఈమేరకు వివాహితపై ఆ వ్యక్తి స్టీల్ కుర్చీతో దాడి చేసినట్టు సమాచారం. తలకు తీవ్ర గాయం కావడంతో కింద పడిపోయింది. వివాదం తరు వాత ఆయన కోపంగా మెట్లు దిగి కిందకు వచ్చేయడాన్ని గమనించిన వాచ్‌మెన్ పైకి వెళ్లి చూడగా ఇంటికి తాళాలు వేసి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, తలుపులు తీసి రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివాహిత కుటుంబ సభ్యులు విజయనగరంలో ఉండడంతో పోలీసులు వారికి సమాచారం అందించారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలి యాల్సి ఉంది.

డ్వాక్రా మహిళలకు 'విజన్ బిల్డింగ్' శిక్షణ

పెందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. పెందుర్తిలోని జిల్లా మహిళా సమాఖ్య భవన్‌లో డ్వాక్రా మహిళలకు శనివారం విజన్ బిల్డింగ్ శిక్షణలో భాగంగా కటుంబ కళలు, వ్యక్తిగత కళలపై తర్ఫీదు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సినీ నటి సావిత్రికి నివాళి

గోపాలపట్నం,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో శోభన్‌బాబు సేవా సంఘం ఆధ్వర్యంలో సినీ నటి సావిత్రి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సావిత్రి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

అదుపు తప్పిన లారీ

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గాజువాక శ్రీనగర్ బ్రిడ్జి వద్ద లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. కొంత భాగం రోడ్డు కిందకు, కొంత భాగం రోడ్డుకి అడ్డంగా నిలిచిపోవడంతో, భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. గంటన్నర పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



పెందుర్తిలో నివాళి అర్పిసున్న ఎమ్మెల్యే పంచకర్ల



గోపాలపట్నం : లక్ష్మీనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- పెందుర్తి, పశ్చిమ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, గణబాబు
- వాడవాడలా అంబేద్కర్ వర్ధంతి సభలు

పెందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీ ఎస్ చైర్మన్ అయితి సింహాచలం, దళిత నాయకుడు డుంబారి రామారావు, బీజేపీ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు, వేగి దివాకర్, గొర్లె అప్పారావు పాల్గొన్నారు. కాగా సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు హాజరై ప్రజల నుంచి 110 అర్జీలు స్వీకరించారు. ప్రతి వినతిని ఆన్‌లైన్ చేసి, సంబంధిత అధికారులకు పంపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

బాబా సాహెబ్‌కు నివాళి

గోపాలపట్నం : స్థానిక లక్ష్మీనగర్‌లో బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సభ జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసి అంబేద్కర్ అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. మల్కాపురం రామ్-రాంజీ సంక్షేమ సంఘం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పెద్దాడ హరికృష్ణ, కాకర పోలారావు, ఎంవీ గిరి, కాకర గోవిందరాజు, పెద్దాడ నాగరాజు, ముప్పిడి రుషికుమార్, బోనుల స్వామి, కాకర రాజు, పెద్దాడ కనకరాజు, కొత్తలంక వెంకటేశ్ పాల్గొన్నారు. జనసేన తరఫున వీరమహిళ నడిగట్ల శంకరమ్మ పాల్గొని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు కాలనీలో సిద్ధార్థ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశ్ నగర్ ఏడుగుల జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావాడ అప్పారావు, ప్రధాన కార్యదర్శి గుడాల ఈశ్వరరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే స్థానిక అంబేద్కర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగి, యూనిట్ ఇన్‌చార్జి చైతన్య, ఐటీడీసీ అధ్యక్షుడు దుర్గారావు, ఉపాధ్యక్షుడు శ్రీధర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలుళర్పించారు. మల్కాపురం గ్రామ మండలిలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు, నాయకులు మండే సత్యనారాయణ, టి.కామేశ్వరరావు, బి.వెంకట్, గణపతి, బయ్యారత్నం పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింహాచలం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలన

గోపాలపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్ శనివారం పరిశీలించారు. సుమారు రూ.19 కోట్లతో స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతి గురించి అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలున్న స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించి, స్టేషన్ల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద చర్యలు చేపట్టిందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర రైల్వే ఉన్నతాధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్

ధనుర్మాస ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు తెల్లవారు జామున 4:30 గంటలకు పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈనెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సంక్రాంతి వరకు వేడుకలను జరిపనున్నట్టు వెల్లడించారు. భక్తులంతా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సాయిబ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ ఎస్టీబీఎల్ ఆవరణలోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో మార్గశిర మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకు వజామున వేద పండితులు స్వామి వారికి పంచామృతాలతో అబిషేకించి, అనంతరం పాలకమండలి సభ్యులు, భక్తులు వూరేగింపుగా తీసుకొచ్చిన పలు రకాల పుష్పాలతో స్వామి వారికి తోమాల సేవలు, పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అధిషింప చేసిన వేద పండితులు వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ధనలక్ష్మి ప్రతిభ



ధనలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బలరామ కృష్ణ

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విశాఖలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శ్రీనగర్ టీఎస్ఆర్ టీబీకే కళాశాల డిగ్రీ బీబీఏ విద్యార్థిని జి.ధనలక్ష్మి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ధనలక్ష్మికి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ తలశిల బలరామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

'శంబాల' సినిమా బృందం సందడి

గోపాలపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నరవలోని విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో శంబాల సినీ బృందం శనివారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా హీరో, హీరోయిన్ ఆది సాయికుమార్, అర్చన అయ్యర్‌తో పాటు యూనిట్ సభ్యులు కళాశాలకు వచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి, చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ, పి. ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



హీరో ఆది సాయికుమార్, హీరోయిన్ అర్చన



జైస్వాల్‌ను అభినందిస్తున్న విరాట్ కోహ్లి



జైస్వాల్, రోహిత్‌శర్మ పరుగుల వేట



విరాట్ బ్యాటింగ్ విధ్వంసం



సెంచరీ సాధించిన డికాక్



స్టేడియంలో అభిమానుల కోలాహలం



జడేజా ఫీల్డింగ్ విన్యాసం

క్రికెట్ సంబరం

కీలక మ్యాచ్‌లో భారత్ అద్భుత ప్రదర్శనతో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి సిరీస్ కైవశం చేసుకోవడంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. రోహిత్, కోహ్లి ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఉదయం నుంచి స్టేడియంలో వేచిచూసిన ప్రేక్షకులు అసలైన బ్యాటింగ్ మజా చవిచూశారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత సెంచరీకి కరతాళధ్వనులతో కేరింతలు కొట్టారు. మొత్తమ్మీద పీఎం పాలెంలోని ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో జరిగిన భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్ సిసలైన క్రికెట్ మజాను అందించింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ (4 వికెట్లు)



మ్యాచ్ వీక్షిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత



మ్యాచ్ తిలకిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్





వికెట్ తీసిన ఆనందంలో భారత్ ఆటగాళ్లు





కులదీప్‌కు సూచనలిస్తున్న కోహ్లి, జడేజా బౌలింగ్



జైశ్వాల్‌ను అభినందిస్తున్న సౌతాఫ్రికా కెప్టెన్ బవుమా



స్టేడియం లోపలికి వెళ్లేందుకు శనివారం ఉదయానికే బారులుతీరిన క్రికెట్ అభిమానులు



మ్యాచ్ ప్రారంభానికి ముందు దక్షిణాఫ్రికా జట్టు సభ్యులు

మూడు గంటలు ముందుగానే...

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌కు డిజిటల్ టికెటింగ్ అమలు చేయడంతో ప్రేక్షకులు మూడు గంటల ముందుగానే స్టేడియానికి చేరుకున్నారు. నిర్వాహకులు క్యూఆర్ కోడ్‌ను ఉదయం 9.30 గంటలకే ఓపెన్ చేయడంతో ప్రేక్షకులు లోపలికి ప్రవేశించారు. సీట్లకు నంబరింగ్ లేకపోవడతో ముందు సీటు కోసం ఆసక్తి చూపారు. గ్యాలరీలు కిక్కిరిశాయి. 80 శాతం ప్రేక్షకులు విరాట్, రోహిత్ పేర్లతో ఉన్న భారత్ జెర్సీని పోలిన టీషర్టులు ధరించడంతో సేడియం నీలి రంగులోకి మారింది. రోహిత్, కోహ్లిని చూసి ప్రేక్షకులు కేరింతలతో స్వాగతం పలికారు. ఫీల్డింగ్‌లో విరాట్, రోహిత్ బాలు పట్టుకున్న ప్రతిసారీ చప్పట్లతో మార్మోగించారు. దారి పొడుగునా టీమిండియా ఆటగాళ్ల ఫ్లెక్సీలను ప్రదర్శించారు. లోకల్ బాయ్ నితీష్‌కుమార్ రెడ్డి ఫ్లెక్సీలు శుక్రవారం భారీగా ఏర్పాటు చేశారు. మ్యాచ్ లో అతడు లేకపోవడంతో శనివారం ఉదయానికే తొలగించారు.

నితీష్‌కుమార్‌కు దక్కని చోటు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏలో శనివారం దక్షిణాఫ్రికాతో తలపడిన భారత్ జట్టులో లోకల్ బాయ్ నితీష్‌కుమార్‌రెడ్డికి చోటు దక్కలేదు. సిరీస్ విజేత నిర్ణయించే కీలకమ్యాచ్ కావడంతో నితీష్‌కుమార్‌రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడంపై కోచ్ గంభీర్, కెప్టెన్ కెఎల్.రాహుల్ ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. తొలి రెండు వన్డేల్లో వాషింగ్టన్ సుందర్ విఫలమవడంతో నితీష్‌కుమార్‌రెడ్డికి చాన్స్ దక్కుతుందని భావించారు. కానీ అతని స్థానంలో తిలక్ వర్మను తుది జట్టులోకి తీసుకున్నారు. దీంతో నితీష్‌కుమార్ మరోసారి బెంచ్‌కే పరిమితమయ్యాడు.

రైతుబజార్లలో స్టాళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 12 రైతుబజార్లలో ఈ నెలాఖరున ఖాళీ అవుతున్న 25 డ్వాక్రా, ఆరు దివ్యాంగుల స్టాళ్లను కొత్త వారికి కేటాయిస్తామని జాయింట్ కలెక్టర్ కార్యాలయం శనివారం ప్రకటనలో తెలిపింది. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17లోగా గోపాలపట్నం రైతుబజారు పక్కనున్న అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో సంప్రతించాలని సూచించారు. 90308 19082 మొబైల్ నంబరులో కూడా సంప్రతించవచ్చునన్నారు.

ఆలయాల్లో ఉత్సవాల విజయవంతానికి ప్రణాళికలు

» హోం మంత్రి వంగలపూడి అనిత

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధానాలయాల్లో నిర్వహించే ప్రత్యేక ఉత్సవాల విజయవంతానికి పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేసినట్లు హోం మంత్రి, దేవాలయాల పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగలపూడి అనిత అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నుంచి లోపాలను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 30న వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం ఉత్సవం సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే ఆలయాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం హైందవం పట్ల అచంచల విశ్వాసంతో ఆలయాల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తోదన్నారు. మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్వయం నియంత్రణ పాటిస్తూ, తోటి భక్తులకు సహకరిస్తూ తీర్థప్రసాదాలను స్వీకరించి ప్రశాంతంగా ఉండాలన్నారు. మంత్రి అనితకు ఈవో ఎన్.సుజాత ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు మంత్రి గోత్రనామాలతో పూజలు చేశారు.



కప్పస్తంభం వద్ద హోం మంత్రి అనిత, కుటుంబసభ్యులు

మ్యాపింగ్ ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలి

» రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, చిత్రంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాల ప్రకారం జిల్లాలో ఓటర్ల జాబితా ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ ఆదేశించారు. ముందస్తు ఎస్ఐఆర్ నేపథ్యంలో బాధ్యతగా వ్యవహరించాలని, ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయనసమావేశమయ్యారు. వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. 2002 జాబితాను 2025తో సరిపోల్చి వివరాలు నమోదు చేసుకోవాలని, పోలింగ్ స్టేషన్లు, నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియ 24.54 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 20,20,726 మంది ఓటర్లు ఉండగా 2,81,415 మంది వివరాలను మ్యాపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. పట్టణీకరణ ప్రాంతాలే ఉండడంతో కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున క్షేత్రస్థాయిలో కొంచెం క్లిష్టత ఏర్పడుతోందని ఈఆర్వోలు, సీఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

సర్కిల్- 1 ఏఎస్‌వోకు సర్కిల్-3 బాధ్యతలు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక పరిధిలోని సర్కిల్ -3లో సహాయ పౌరసరఫరాల శాఖాధికారి బాధ్యతలను సర్కిల్ 1 ఏఎస్‌వో సి.శ్రీహరికి అప్పగించారు. సర్కిల్-3 ఏఎస్‌వో టి.కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడంతో ఈ చర్యలు తీసుకున్నామని డీఎస్వో వి.భాస్కర్ తెలిపారు.

సేంద్రియ రైతులే రాష్ట్రానికి ఆస్తి

ఆర్గానిక్ మేళాలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



మేళాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ రైతులు రాష్ట్రానికి ఆస్తి అని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాను ఆయన శనివారం సందర్శించారు. ప్రకృతి పంటలు, ప్రకృతి రైతులకు చేయూతనిస్తామని తెలిపారు. పబ్లిక్, ప్రైవేటు, భాగస్వామ్యం ద్వారా పలు ప్రాజెక్టులు చేపట్టామన్నారు. గ్రామీణ రైతుల ఎఫ్‌పీవోల ద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరాల్లో రసాయనాలు వినియోగించకుండా పండించిన సేంద్రియ పంటలను మేళాగా నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవిచౌదరి, విజయకుమార్, సూర్యకుమార్, పేరి రామకృష్ణ, జలగం కుమారస్వామి, వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్‌గార్డెన్ గ్రూప్‌లు, గ్రీన్ క్లైమేట్, అగ్రి డీఎస్‌ఏ వెంచర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తూర్పు కోస్తా రైల్వే జీఎం తనిఖీలు



సింహాచలం స్టేషన్‌లో జీఎం పరిశీలన

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వేజోన్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం విశాఖలోని ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల పనులను తనిఖీ చేశారు. విశాఖపట్నం-గోపాలపట్నం, వడ్లపూడి-గేట్ జంక్షన్ మధ్య జరుగుతున్న 3, 4వ లైన్ పనుల పురోగతిని పరిశీలించారు. సింహాచలం స్టేషన్ అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. ఇండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025-26 ముగింపు పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ రైల్వే జోన్ల నుంచి 180 మంది వెయిట్ లిఫ్టర్లు, 16 విభాగాలలో పోటీ పడ్డారని, ఇది అథ్లెట్ల ప్రతిభకు నిదర్శనమన్నారు. విజేతలకు అవార్డులను అందజేశారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు అజయ్ సమల్, ఇ.శాంతారామ్, కె.రామారావు, ఎం.హరనాథ్, జుసుఫ్ కబీర్ అన్సారీ పాల్గొన్నారు. 63వ సివిల్ డిఫెన్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు.

జీఎస్‌టీ అధికారుల బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ-వాణిజ్య పన్నులశాఖ) విశాఖపట్నం డివిజన్-1 జాయింట్ కమిషనర్‌గా అనంతపురంలో పనిచేస్తున్న పి.బి.వల్లి, డివిజన్-1 డిప్యూటీ కమిషనర్‌గా తిరుపతి రీజనల్ జీఎస్‌టీ ఆడిట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.హరీశ్‌కుమార్ పదోన్నతిపై విశాఖ వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమావేశాలు నిర్వహించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్నుల లక్ష్యసాధనకు ప్రణాళికను వివరించారు. సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన పీబీ వల్లి, హరీశ్‌కుమార్

స్టేడియంలో ఎకోఫ్రెండ్లీ సెల్ఫీ పాయింట్



సెల్ఫీపాయింట్‌లో కేశినేని శివనాథ్, సతీష్‌బాబు

మధురవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో శనివారం పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ భాగస్వామ్యం, జీవీఎంసీ సహకారంతో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు దీనిని ఏర్పాటు చేశామని ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీష్ తెలిపారు. పలువురు క్రీడాభిమానులు దీని వద్ద ఫొటోలు తీసుకున్నారు.

ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో ధరల పట్టిక తప్పనిసరి

» జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో తప్పనిసరిగా ధరల పట్టిక లను రిసెప్షన్‌లో ప్రదర్శించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రైవేటు హాస్పిటల్స్, ల్యాబ్స్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరల పట్టిక ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయానికి డేటా అందించాలన్నారు. ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరరారు. హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేయించాలన్నారు. సమా వేశంలో డీఎస్‌వో డాక్టర్ జగదీశ్‌ప్రసాద్, డాక్టర్ ఉమావతి, డెమో బి.నాగేశ్వరరావు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్మకానికి పెట్టి వ్యక్తిన పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గాజువాక వై జంక్షన్‌కు చెందినటేకు రమేష్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వడ్లపూడిలో నిల్వ ఉంచాడు. వాటిని దొంగచాటుగా విక్రయించాలని ప్రయత్నిస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతడి నుంచి 1,050 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, దువ్వాడ పోలీసులకు అప్పగించారు.

ఉద్యోగాల పేరుతో మోసం: నిందితులపై కేసు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తానని పలువురిని మోసం చేసిన నిందితులపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పాత డెయిరీఫారం, క్రాంతినగర్‌కు చెందిన మహ్మద్ మోహిబ్ యూనిటీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాడు. అతడి మిత్రుడు గణేశ్ పరిచయం చేసిన వడ్డి ఝాన్సీ అలియాస్ యంపాడ ఝాన్సీ, అలియాస్ కోరోకన్నా ఝాన్సీ, ఆమె భర్త వై.సతీశ్‌లు మోహిబ్‌కు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో సూపర్‌వైజర్ పోస్టు వేయిస్తామని నమ్మబలికారు. బదులుగా రూ.5.9 లక్షలు వసూలు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్, తర్వాత న్యూఢిల్లీకి పంపించారు. అయితే నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ అని తేలడంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు సొమ్ము తిరిగివ్వమని ఒత్తిడి చేయడంతో బెదిరింపులకు దిగారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.